భక్తజన సందోహం మధ్య వైభవంగా శ్రీ ముఖ్యనాథస్వామి

ఆలయ తృతీయ వార్షికోత్సవం

- వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు.. కనులపండువగా స్వామివారి కల్యాణ మహోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు.. ఆధ్యాత్మిక శోభతో మార్మోగిన ముప్పారం

ధర్మసాగర్ /పరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోనవంబర్ 16 (జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం గ్రామంలోని పురాతన శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయంలో తృతీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ జరిగాయి. ఆలయ పునఃవ్యవస్థాపకులు శివసాని ప్రవీణ్ రవీంద్ర ఆధ్వర్యంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించడంతో పాటు ప్రత్యేక హోమాలు, పూజలు చేపట్టారు. వేదమంత్రాల నడుమ సాగిన పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ ముఖ్యనాథేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య జరిగిన స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించేందుకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు. ఉత్సవ విగ్రహాలతో నిర్వహించిన ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తుల జయజయధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ వార్షికోత్సవం పండుగ వాతావరణంలో కొనసాగింది.









ఆలయ అభివృద్ధికి విశేష కృషి

శ్రీ ముఖ్యనాథస్వామి ఆలయ పునఃవ్యవస్థాపకులు శివసాని ప్రవీణ్ రవీంద్ర ఆధ్వర్యంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు వార్షికోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూజా కార్యక్రమాలు, కల్యాణ మహోత్సవం, ప్రసాద వితరణ, ఊరేగింపును సమన్వయంతో నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలతో ముప్పారం గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ, అమరేందర్ రెడ్డి, పురావస్తు శాఖ ఏడీ దేవనగరి బుజ్జి, సదానందం, పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, ఆలయ పునఃవ్యవస్థాపకులు శివసాని ప్రవీణ్ రవీంద్ర, గౌరవ సలహాదారులు గొట్టిముక్కుల సురేష్ కుమార్, దారపు చంద్రయ్య, రాములు, రవీందర్ రెడ్డి, మారబోయిన యాదగిరి, ఎర్ర చేరాలు, వజ్ర రాజబాబు, మోడెమ్ రవి, వార్డు సభ్యులు ఎతిరాజుల శోభా మల్లయ్య, వెల్దండి శ్వేత, మాజీ సర్పంచ్ చామల వాసుదేవరెడ్డి, గొనేల సమక్క రాజయ్య, గై కమల, మాజీ ఎంపీటీసీ పెద్ది శ్రీను తదితరులు పాల్గొన్నారు.